తేలని విలీనం.. ప్రగతి శూన్యం

- పంచాయతీల్లో అభివృద్ధికి ఆటంకంగా మారిన విలీనం ప్రతిపాదనలు
- రెండేళ్లుగా నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు
- కష్టంగా మారిన పంచాయతీల నిర్వహణ
- విలీనాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలు


మేజర్ పంచాయతీ ఎస్.అన్నవరం వ్యూ

తుని రూరల్: తుని మున్సిపాలిటీలో విలీనం ప్రతిపాదనలు ఎటూ తేలకపోవడంతో నాలుగు పంచాయతీల్లో అభివృద్ధి కుంటిపడుతోంది. ప్రజల సౌకర్యార్థం సాధారణ పనులు చేయాలన్న గృహ, గృహేతర పన్నులపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం లేదు. నాలుగు త్రైమాసికాల (క్వార్టర్ల) నిధులు మంజూరు కావాల్సి ఉంది. దీంతో సిబ్బంది జీతభత్యాలు, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణ పెనుభారంగా మారింది. ఆ పంచాయతీల్లో ఏ పని చేపట్టాలన్న నిధులు కోసం అధికారులు ప్రజలు ఆస్తి పన్నుల ఎప్పుడు చెల్లిస్తారా ? అని ఎదురు చూడాల్సి వస్తోంది.

2012లో ఉత్తర్వులు

తుని పురపాలక సంఘానికి సమీపంలో ఉన్న మండలంలో మేజరు పంచాయతీ ఎస్.అన్నవరం, కుమ్మరిలోవ, తాళ్లూరు, రేఖవానిపాలెం పంచాయతీలను తుని మున్సిపాలిటీలో విలీనం చేస్తూ 2012లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నాలుగు పంచాయతీల పరిధి గ్రామాల్లో జనాభా లెక్కల ప్రకారం 25 వేల మందికిపైగా నివశిస్తున్నారు. విలీనంతో తమ గ్రామాల్లో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమవుతుందని, ప్రజల జీవన విధానం దెబ్బతింటుందని, మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కోల్పోతామని, పురపాలక సంఘానికి అధికంగా పన్నులు చెల్లించాల్సి వస్తుందన్న కారణాలతో విలీనం ప్రతిపాదనలను ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకించారు. తమ గ్రామాలను పంచాయతీలుగానే కొనసాగించాలని కోరుతూ కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. దాంతో పురపాలక సంఘంలో విలీనం ప్రతిపాదనలు నిలిచిపోయాయి. విలీనం ప్రతిపాదనలు ఉండడంతో పంచాయతీరాజ్‌శాఖ సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించలేదు.

నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు

పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడాన్ని కారణంగా చూపుతూ కేంద్రం ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను రెండేళ్లుగా నిలిపివేసింది. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోట్లలో ఆయా పంచాయతీలకు జమ కాలేదు. జనాభా ఆధారంగా కేంద్రం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తుంది. ప్రతి సంవత్సరం ఒక్కొక్క వ్యక్తికి రూ.360 చొప్పున రెండేళ్లలో రూ.1.80 కోట్లకు పైగా ఆర్థిక సంఘం నిధులు జమ కావాల్సి ఉంది. ఆ మొత్తం నిధులు పంచాయతీలకు చేరకపోవడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. ఆర్థిక సంఘం నిధులు అందకపోవడంతో గ్రామాల్లో ప్రధాన సమస్యలకు నిధులు కొరత ఏర్పడింది.

విలీనం ప్రతిపాదనలు రద్దు చేయాలి



మా గ్రామంలో ప్రజలంతా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పురపాలక సంఘంలో విలీనమైతే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దవుతుంది. దీంతో వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోతారు. పంచాయతీలో సంవత్సరానికి ఒకసారి ఇంటి పన్ను చెల్లిస్తున్నాం. విలీనమైతే సంవత్సరానికి రెండు సార్లు చెల్లించాల్సి ఉంది. విలీనం ప్రతిపాదనలు రద్దు చేసి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి.

– తమరాన శ్రీనివాసరావు, గ్రామస్తుడు, తాళ్లూరు

ఆస్తి పన్నులతో నిర్వహణ



గ్రామస్తులు చెల్లించిన ఆస్తి పన్నులతో పంచాయతీల నిర్వహణ జరుగుతోంది. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు రాలేదు. ప్రభుత్వ గ్రాంట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. నాలుగు పంచాయతీల్లో పాలకవర్గాల స్థానంలో ప్రత్యేక అధికారులు నియమితులయ్యారు. పురపాలక సంఘంలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ కోర్టులో కొనసాగుతున్న కేసులపై న్యాయ నిపుణులతో చర్చించాల్సి ఉంది.

– సాయి నవీన్‌కుమార్, ఎంపీడీఓ, తుని

క్లుప్తంగా

ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలి


ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

ఏలేశ్వరం: మత రాజకీయాలను వ్యతిరేకంగా వచ్చే నెల 4న విజయవాడలో నిర్వహించే ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో గురువారం ర్యాలీ చేశారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో ప్రజలకు కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు ప్రజలపై కపటప్రేమ ప్రదర్శించిందన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేస్తామని చెప్పి ఒక్క పింఛన్లకే పరిమితమైందన్నారు. అన్నిగ్రామాల ప్రజలు విజయవాడ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొడుగు సత్యనారాయణ, జగ్గంపూడి రాజబాబు, వెంకటేశ్వరరావు, రొబ్బల సంకురమ్మ, నాగమణి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

గోకవరం: క్యాన్సర్ వాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి డీఎస్ మూర్తి అన్నారు. జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కొత్తపల్లిలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా క్యాన్సర్ బారిన పడకుండా ముందుగానే వ్యాధి లక్షణాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యాధుల నివారణకు మంచి ఆహారం, వ్యాయామం వంటి అలవాట్లను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశావర్కల్లు పాల్గొన్నారు.

బీమాతో పంటలకు రక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఓ విజయలక్ష్మి

కోటనందూరు: బీమాతో సాగు చేసిన పంటలకు రక్షణ లభిస్తుందని ఉద్యానవనశాఖ అధికారి జి.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట, కేఎస్ కొత్తూరు గ్రామాల్లో గురువారం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా మామిడి, జీడిమామిడి పంటలకు నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.30 వేల వరకూ పరిహారం అందుతుందన్నారు. మామిడి, జీడిమామిడి పంటలకు రూ.1500 ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 15 వరకూ బీమా ప్రీమియం చెల్లించే అవకాశం ఉందన్నారు. ఉద్యాన పంటల్లో వచ్చే తెగుళ్లు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు లగుడు శ్రీను, జి.రాంబాబు పాల్గొన్నారు.

కార్తిక వనసమారాధన

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో గురువారం వనసమారాధన నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గ్రామ మాజీ ఉపసర్పంచ్ దార్లంక శ్రీను, సత్య దంపతుల ఆధ్వర్యంలో రహదారి పక్కనే ఉన్న సాయిబాబా ఆలయం వద్ద వనసమారాధన ఏర్పాటు చేశారు. సత్యదీక్షలు, శివ మాల, అయ్యప్ప మాలలు ధరించిన స్వాములతో పాటు గ్రామస్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా పడిపూజ

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో అయ్యప్ప స్వామి భక్తులు గురువారం పడి పూజ నిర్వహించారు. తొలుత స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తిగీతాలు ఆలపిస్తూ స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. అయ్యప్ప స్వామి శరణుగోషతో స్వాములు నృత్యాలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మికత శోభ నెలకొంది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్పస్వామి మాలధారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఏఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని మల్లేపల్లికి చెందిన వి.వీరబాబు (31) మద్యానికి బానిసగా మారాడు. అతడికి పెళ్లి అయ్యి నాలుగేళ్లు పూర్తయినప్పటికీ పిల్లలు పుట్టకపోవడంతో మనస్థాపానికి గురై ఈ నెల 5న తన ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. అతడిని చికిత్స నిమిత్తం బంధువులు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి తమ్ముడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించినట్టు లెక్చరర్ శ్రీనివాసరావు తెలిపారు. జువాలజీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు చెందిన విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి వారి బ్లడ్ గ్రూప్ నిర్ధారించినట్టు చెప్పారు. ప్రిన్సిపాల్ డి.చిన్నారావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు పాల్గొన్నారు.

ఉత్తరకంచిలో ముద్రగడ పర్యటన


ఉత్తరకంచిలో అభిమానులతో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచి గ్రామంలో గురువారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం పర్యటించారు. గ్రామానికి చెందిన ముద్రగడ అభిమాని దండు భాస్కరరావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ముద్రగడ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఉమ్మిడి తాతీలు, మొల్లి వీరబాబు, అమరాది కాశీ, ముద్రగడ అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు దండు సత్తిబాబు, గౌతు స్వామి, జల్లిగంపల ప్రభాకరరావు, చెనంశెట్టి భద్రం, గొనగాల వెంకటరమణ, లొండ బాబు, దేవ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

ప్రత్తిపాడు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది గురువారం ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని, మెడికల్ ఇన్సూరెన్సు అమలు చేయాలని, యాజమాన్యం నుంచి బకాయిలు చెల్లింపులు జరిపేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల డీఈఓ బి.ఇజ్రాయిల్ రాజు, పి.మణికంఠ, డ్రైవర్లు పి.అప్పారావు, ఎం. భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చలో అమరావతిని విజయవంతం చేయాలి


తునిలో చలో అమరావతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణస్వరూప్

తుని: ఎస్సీ వర్గీకరణ, క్రీమీలేయర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 19న నిర్వహించ తలపెట్టిన చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. స్థానిక కొండవారిపేటలో గురువారం చలో అమరావతి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణస్వరూప్ మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో దళితులను అణచివేసి రాజకీయంగా, సామాజికంగా ఎదగకుండా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. వర్గీకరణ, క్రిమిలేయర్ అమలు జరిగితే దళితులకు భవిష్యత్ ఉండదని, విద్య, ఉద్యోగ, జీవన రంగాల్లో అవకాశాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మీలా గోపి, బోటపాటి రమణబాబు, దువ్వాడ దావీదు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి


రైతుల సమస్యలు వింటున్న తహసీల్దార్ చిరంజీవి

కిర్లంపూడి: గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.చిరంజీవి సూచించారు. మండలంలోని కృష్ణవరం సచివాలయంలో గురువారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలకు సంభందించిన అర్జీలను రైతుల నుంచి స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రావణి, ఎంఎల్ఎస్ఓ షేక్ బషీర్, ఆర్ఐ సత్యదేవి తదితరులు పాల్గొన్నారు.

దిగువశివాడలో రీ సర్వే గ్రామసభ

రౌతులపూడి: మండలంలోని దిగువశివాడలో గురువారం భూముల రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ టి.నరేష్ ఆధ్వర్యంలో అధికారులు రైతుల నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. రీ సర్వేలో ఏమైనా పొరపాట్లు, సరిహద్దులు, కొలతలు, తదితర పలు సమస్యలపై ప్రజలు, రైతులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నైపుణ్య గణన సర్వే


ప్రత్తిపాడులో శిక్షణా తరగతులకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది

ప్రత్తిపాడు: యువత, చదువుకున్న వారిలో నైపుణ్యాలను తెలుసుకునేందుకు గాను నైపుణ్య గణన (సెన్సస్ సర్వే) సర్వే పారదర్శకంగా చేపట్టాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు సూచించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సెన్సస్ సర్వేపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న వారందరి నైపుణ్యాలను గణన చేయాలన్నారు. ఈ సర్వేలో ఉద్యోగాల కోసం ఎదురు చూసే యువతే మాత్రమే కాకుండా చేతి వృత్తులు, గృహిణుల వరకూ ప్రతీ వృత్తిని గణనలోకి తీసుకోవాలన్నారు. గృహిణులయితే వారి చదువు, గతంలో పోటీ పరీక్షలు రాశారా ? వారికి ఎలాంటి ఆశక్తులున్నాయి ? అనే అంశాలు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం టీఓటీలు పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

లలితా దేవికి విశేష పూజలు


తునిలో లలితాదేవికి పూజలు చేస్తున్న మహిళలు

తుని: స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన లలితా మండలి ప్రతినిధులు లలితాదేవి పారాయణ సిల్వర్ జూబ్లీ ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. లలితా మండలి ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా ఏటా దసరా పండుగకు లలితాదేవి పారాయణలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం 25 సంవత్సరాలు పూర్తి చేస్తుకున్న సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభావతి, మంగారత్నం, రుక్మిణి, గీత, సోని, సత్యవతి, మాధవి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

కార్తికమాసం విశిష్టతపై ఆధ్యాత్మిక ప్రసంగం


కార్తికమాస విశిష్టతపై ప్రసంగిస్తున్న నాగ శివశారద

అన్నవరం: పవిత్ర కార్తిక మాసంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని సేవించిన వారికి కోరిన కోర్కెలు సిద్ధిస్తాయని ప్రముఖ విద్యావేత్త, ఆధ్యాత్మిక ఉపన్యాసకురాలు నాగ శివ శారద తెలిపారు. కార్తిక మాసం సందర్భంగా రత్నగిరి కళావేదిక మీద మంగళవారం నుంచి గురువారం వరకూ ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. కార్తికమాస విశిష్టత, కార్తిక ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి, కార్తిక పౌర్ణమి రోజూ చేయాల్సిన పూజలు తదితర అంశాలను వివరించారు. సత్యదేవుని సన్నిధిలో ఆధ్యాత్మిక ప్రసంగం చేసే అవకాశం కల్పించిన దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

రౌతులపూడి: ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫాం (ఏపీసీఎన్ఎఫ్) మాస్టర్ ట్రైనీ దాడి వరలక్ష్మి మండలంలో అవినీతి, నిధుల అవతవకలకు పాల్పడ్డారని గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ చేసిన ఫిర్యాదు మేరకు గురువారం అధికారులు విచారణ చేపట్టారు. రౌతులపూడి రైతు సేవా కేంద్రం వద్ద విచారణ జరిగింది. రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రాజెక్టు కన్సల్టెంట్ అరుణ, థెమాటిక్ లీడ్ జెండర్ వి.భాగ్యలక్ష్మి విచారణ చేశారు. ఫిర్యాదుదారుడు రాపర్తి రామకృష్ణ, మరికొందరు రైతుల నుంచి వివరాలు సేకరించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఎంటీ దాడి వరలక్ష్మి నుంచి వివరాలు సేకరించి విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

విద్యార్థులకు స్పెల్ బీ పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

తుని: రోటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంగం యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు గురువారం స్పెల్ బీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలకు తమరాన దేవి వరప్రసాద్ జడ్జిగా వ్యవహరించారు. జూనియర్స్ విభాగంలో శ్రీప్రకాష్, లయోలా పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయస్థానం సాధించారు. సీనియర్స్ విభాగంలో శ్రీచైతన్య, లయోలా పాఠశాలల విద్యార్థులు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో రోటరీ, రోటరాక్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు


గాయత్రి

తుని: రైలు ప్రయాణం చేస్తూ మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..తుని మండలం ఎన్.సూరవరం గ్రామానికి చెందిన వేములపూడి గాయత్రి (19) ఈ నెల 4న తన 17 నెలల కుమారుడికి వైద్యం నిమిత్తం విజయవాడ తీసుకెళ్లేందుకు తుని వచ్చింది. తుని రైల్వేస్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. కాగా గాయత్రి విజయవాడలో ఆసుపత్రికి చేరలేదనే సమాచారంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతకగా ఆమె ఆచూకీ లభించలేదు. గురువారం ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

తొండంగి: గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ నేత యనమల కృష్ణుడు అన్నారు. వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మండలంలోని ఒంటిమామిడిలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతానికి అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు గంట చక్రం, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భూమిపై హక్కులు కల్పించాలి



ప్రత్తిపాడులో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రత్తిపాడు: గిరిజనుల సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించాలని కోరుతూ వెంకటనగరం గ్రామ గిరిజనులు గురువారం ప్రత్తిపాడులో ఆందోళన నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు ఆధ్వర్యంలో గిరిజనులు, వ్యవసాయ కూలీలు ప్రత్తిపాడులో ర్యాలీ చేశారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్, బజారు, మెయిన్‌రోడ్డు గుండా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటనగరంలో భూములను తమ పూర్వీకుల నుంచి సాగు చేసుకోవడంతో పాటు ఫసలీ రూపంలో శిస్తు కూడా చెల్లించామని తెలిపారు. ప్రస్తుతం ఈ భూములను కొనుగోలు చేశామని కొందరూ, ఈ భూములకు తామే వారసులమంటూ మరికొందరు తమను భయభ్రాంతులను గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి భూములపై తమకు హక్కులు కల్పించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, వెంకటనగరం వ్యవసాయ కూలీ సంఘం అధ్యక్షుడు బండి సూరిబాబు, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు మన్నేపల్లి వెంకటరమణ, బండి రత్నం, మట్టల అచ్చమ్మ, రేచుకట్ల దేవి, ఇరటా సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి


సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సీవీ రామన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భౌతిక శాస్త్రంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీన్ సుబ్బారావు, వివిధ శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మెహర్ మాట్లాడుతూ భౌతికశాస్త్ర అభివృద్ధికి రామన్ చేసిన సేవలను కొనియాడారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ కేవీఎస్ కుమార్ మాట్లాడుతూ రామన్ జీవిత చరిత్రను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దివాకర్, అధ్యాపకులు పీవీ కృష్ణారావు, వి.నారాయణరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.